# బంగారు గాజులు

- అద్దేపల్లి సుచిత్రాదేవి

''నేడే మా దగ్గర మీ డబ్బును ఆదా చేయండి! అత్యధిక లాభాలు పొందండి! పదివేల డిపాజిట్‌కి రెండు గ్రాముల బంగారు కాసును బహుమతిగా పొందండి. ప్లస్ ఆరుశాతం ప్లస్ ఇరవై ఎనిమిది శాతం వడ్డీ'' పేపర్లలో, టీవీ ఛానల్స్‌లో, వార పత్రికలలో కనిపిస్తున్న ఆ ప్రకటన శ్రీదేవిని ఎంతో ఆకట్టుకుంది.

ఎంత మంచి అవకాశం, ఎంత లాభం?

పదివేలు కట్టగలిగితే చాలు. అప్పటికప్పుడు రెండు గ్రాముల బంగారం అంటే వెయ్యి రూపాయలు, ఆరొందలు కేష్ ఇచ్చేస్తారు. అంటే పదహారువందలు వచ్చేసినట్లే. ఇంకా నెలనెలా పోస్టు డేటెడ్ చెక్స్ ద్వారా దగ్గర దగ్గర పదివేలకి రెండువందల యాభై రూపాయల వడ్డీ ఇస్తారుట. అంటే ఏడాదికి వడ్డీ రూపేణా మూడువేలు వస్తుంది. అంటే మొత్తం నాలుగున్నర వెయ్యి అన్నమాట. గవర్నమెంటు వాళ్లు ఇచ్చే వడ్డీలవలన మనం డిపాజిట్ చేసిన మొత్తం అయిదేళ్లకి రెట్టింపు అవుతుంటే ఈ లెక్కన రెండేళ్లకే మన డబ్బు రెట్టింపు అవుతుంది''

శ్రీదేవికి ఆ ప్రకటనలోని స్కీము ఎంతో లాభదాయకంగా తోచింది అన్ని లెక్కలు వేసుకున్నాక. అంతే ఇక భర్త దగ్గర పోరు మొదలుపెట్టింది. ఎక్కువొద్దుగానీ ఎలాగైనా ఓ పదివేలు డిపాజిట్ చేసి తీరాలన్నది.

శ్రీదేవి భర్త శ్రీనివాస్‌కీ భార్య చెబుతున్నది బాగానే వుందనిపించింది కాస్త సందేహాలున్నా. అసలు హఠాత్తుగా పదివేలంటే ఎక్కడ్నుంచి తేవాలి? వీళ్లది మామూలు మధ్య తరగతి కుటుంబం. అతనికి జీతం మరీ తక్కువేమీ కాకపోయినా పెరిగిన దినసరి ఖర్చులతో ఇద్దరు పిల్లలతో వచ్చింది వచ్చినట్లు సరిపోతోంది. అప్పులు చేయకుండా వున్నంతలో ఇప్పటివరకూ సంసారం సజావుగానే సాగిపోతోంది. అయితే శ్రీదేవికి అది తృప్తిగాలేదు.

వచ్చిన ఆదాయం సరిపెట్టుకోవడంకాదు, ఆదా కూడా చేయగలగాలి అన్నది ఆమె ఆలోచన. అందుకే ఆ స్కీమ్ ఆమెనంతగా ఆకర్షించింది.

అయితే భర్త అన్నట్లు పదివేలకి ఏం చేయాలి?

బేంక్‌లో ఏదో అత్యవసరాలకి అని వుంచి పెట్టింది వెయ్యో పదిహేనువందలో వుంటుంది అంతే.

మరెలా? ఎవరినైనా అడిగితేనో? అప్పుచేసి మరీ వడ్డీలకివ్వడం సమంజసమా? వాళ్లకి మాత్రం వడ్డీ ఇవ్వవద్దూ? అప్పుడేమయింది ఆదాయం? అయినా హఠాత్తుగా పదివేలు ఇమ్మంటే మాత్రం ఎవరిస్తారు? భర్త తరపునకానీ తన తరపునగానీ అందరూ అందరే. అంతంతమాత్రం వాళ్లే.

> మూడోనెలలో ఓరోజు టీవీ న్యూస్‌లో చెప్పారు ''ఫలానా నగల దుకాణం మూతబడింది. ప్రజల దగ్గర నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్ల రూపేణా డబ్బు వసూలు చేసుకుని ఇప్పుడు ఓనరు ముఖం చాటేసాడు. డిపాజిటర్లందరూ దుకాణం ముందు చేరి గగ్గోలు పెడుతున్నారు'' అని.

ఎలా? ఎలా? ఎలా?

ఏ పని చేస్తున్నా అదే ఆలోచన అయింది ఆమెకి. బట్టలు ఉతుకుతూ చేతికున్న బంగారు గాజులు వెనక్కి తోసుకుంటుంటే తళుక్కున మెరిసింది ఆ ఆలోచన.

రెండు జతల బంగారుగాజులు. అయిదు సవరలు. బయట ఎక్కువ వడ్డీకి కాక బేంకులో గోల్డ్ లోన్ తీసుకుంటే పదివేలు ఈజీగా వస్తాయి. బేంకులో కట్టాల్సిన వడ్డీ తక్కువే. ఈ స్కీమ్ ప్రకారం వచ్చే వడ్డీలో సగం కూడా అవదు. అయినా ఏదో అవసరపు ఖర్చు మీద పడిందనుకుని నెలనెలా వడ్డీ బేంకులో కట్టేస్తే సరి. ఏడాది డిపాజిట్ చేసి ఈ ఎక్కువ వడ్డీ దాచుకుని ఏడాది తరువాత ఓ సవర బంగారం కొనుక్కోవచ్చు. గాజులు విడిపించుకుంటేసరి.

అంతే! ఆ రోజు సాయంత్రమే భర్త ఆఫీసు నుండి రావడం ఆలస్యం తన ఉపాయం చెప్పింది.

శ్రీనివాస్‌కది ఓ నిముషం సబబేనా అనిపించింది.

''మన దగ్గర పదివేలుంటే సరేగానీ గోల్డ్‌లోన్ తీసుకుని డిపాజిట్ చేయడం ఏమిటి? అదీగాక వీళ్లేమన్నా మధ్యలో ఎగ్గొడితేనో?'' అంటూ సందేహాలు వెలిబుచ్చాడుగానీ శ్రీదేవి మొరాయించింది.

''అబ్బా! మీకన్నీ అనుమానాలే. అయినా లోన్‌కని ఇచ్చేది నా గాజులేగా. ముందు మీరు నేను చెప్పినట్లు చేయండి'' అని పోరు పెట్టింది.

ఇక చేసేదేంలేక శ్రీనివాస్ తనకు తెలిసిన ఓ బాంక్ ఫ్రెండ్ ద్వారా భార్య చెప్పినట్లు గాజలు బాంకులో పెట్టి పదివేలు తెచ్చాడు. ఆ మరునాడే ఇద్దరూ వెళ్లి ఆ డబ్బు అనుకున్నట్లే డిపాజిట్ చేసి వచ్చారు. అదో పెద్ద నగల దుకాణం. లోపల నగలన్నీ ధగధగలాడుతున్నాయి. ఏసి షోరూమ్. చాలా కాస్ట్లీగా వుంది అక్కడి వ్యవహారమంతా. అదంతా చూసి వచ్చిన తరువాత తాము చాలా గొప్ప సంస్థలోకి డబ్బు డిపాజిట్ చేసినట్లు అనిపించింది.

వాళ్లిచ్చిన రెండు గ్రాముల బంగారపు కాసు,



ఆరుశాతం డబ్బుతోపాటు నెలనెలా వేసుకోమని ఇచ్చిన పోస్ట్ డేటెడ్ చెక్స్ (వడ్డీ) భద్రంగా బీరువాలో దాస్తుంటే ఎంతో గర్వంగా అనిపించింది శ్రీదేవికి.

నగరంలో కొత్తగా ఓపెన్ చేసిన **'దేవీ గోల్డ్ హౌస్'** వారివద్ద డబ్బు **డిపాజిట్** చేసినట్లు ఇరుగుపొరుగువారితో మురిసిపోతూ చెప్పింది కూడా. ఒకరిద్దర్ని అక్కడ కట్టమని సలహా కూడా ఇచ్చింది. రెండు నెలలు ఎలా గడిచిపోయాయో తెలీదు. వడ్డీ, చెక్స్ డేట్ ప్రకారం వెళ్లి తన బేంక్ అకౌంట్‌లో వేసుకున్నది.

మూడోనెలలో ఓరోజు టీవీ న్యూస్‌లో చెప్పారు ''ఫలానా నగల దుకాణం మూతబడింది. ప్రజల దగ్గర నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్ల రూపేణా డబ్బు వసూలు చేసుకుని ఇప్పుడు **ఓవరు** ముఖం చాటేసాడు. **డిపాజిటర్లందరూ** దుకాణం ముందు చేరి గగ్గోలు పెడుతున్నారు'' అని.

శ్రీదేవికి ముందు తాను న్యూస్‌లో చూస్తున్న సమాచారం కలో నిజమో అర్థంకాలేదు. అది తాము డిపాజిట్ చేసిన నగల దుకాణమే.

మరి తమ పదివేలు?

అప్పుడు పక్కనే కూచుని న్యూస చూస్తున్న శ్రీనివాస్ భార్యను అమాంతం మింగేసేలా చూసాడు.

''నేనప్పుడే చెప్పాను. వద్దు ఇదేదో నమ్మదగ్గ వ్యవహారంలా లేదని. ఆహా, ఓహో కోట్ల మీద వ్యాపారం. మన బోడి పదివేలు ఎక్కడికి పోతాయన్నావు. చాలా వడ్డీ వస్తుందన్నావు. ఇప్పుడేమయింది? నీలా ఆ ఎక్కువ వడ్డీకి, వాడిచ్చే కాసు బంగారానికి ఆశపడిన వారు లక్షమంది కట్టారు. వాళ్లు కోట్లు చేసుకున్నారు. అమాయక జనాన్ని సుడిగుండంలో ముంచినట్లు ఈ వడ్డీ గుండంలో ముంచారు. పోయింది పదివేలు ఎగిరిపోయింది. బేంకులో పదివేల అప్పు మిగిలింది. ఆ అప్పెలా తీరుద్దాం? గాజులెలా విడిపించుకుంటాం?'' తిడుతున్నవాడల్లా హఠాత్తుగా గుర్తుకు వచ్చినట్లు అడిగాడు.

''కట్టగట్టి ఇచ్చాడుగదా వడ్డీ చెక్స్ అని. ఈనెల వడ్డీ అయినా వచ్చిందా? బేంకులో వేసావా?''

''వేసాను. అయినా రేపెళ్లి బేంకులో కనుక్కుంటాను కేష్ అయిందో లేదోనని'' తల వంచుకుని మెల్లగా అంది శ్రీదేవి.

ఆ రాత్రి ఆమె అన్నం తినలేదు. నిద్రపోలేదు. కళ్లు మూసినా తెరిచినా వలయాలుగా తిరుగుతూ బంగారు గాజులే కనిపించసాగాయి. భర్త అన్నట్లు ఇంక వాటినెప్పటికి తెచ్చుకోవాలి? ఆ మరుసటి రోజు పొద్దునే వెళ్లి బేంకులో విచారించింది. అంతకుముందు వారమే వేసిన చెక్ ఆ నగల దుకాణం వాళ్లిచ్చినది రిటర్న్ అయిందని చెప్పారు బేంకులో.

బౌన్సు అయిన చెక్‌ని ఆమెకందిస్తున్న కౌంటర్‌లోని వ్యక్తి నవ్విన నవ్వు తనని ఎగతాళి చేస్తున్నట్లుగా పదేపదే అనిపించింది శ్రీదేవికి.

★




